www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 16 నవంబర్ 2022
5
తూర్పుగోదావరి




సిజిఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్)ను బుధవారం రాజానగరం దివ్య డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పర్యవేక్షక ఇంజినీర్(ఆపరేషన్) టివిఎస్ఎన్.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిజిఆర్ఎఫ్ ఛైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అలాగే రాజమహేంద్రవరంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. వినియోగదారులు ఈ వేదికలో పాల్గొని సమస్యలు లిఖిత పూర్వకంగా తెలియజేయొచ్చని తెలిపారు.

పాఠ్యపుస్తకాలు ఏవీ?

- కళాశాలలు ప్రారంభమై నాలుగు నెలలు పూర్తి
- లెక్చరర్ల చొరవతో పాత పుస్తకాల పంపిణీ
- ఆందోళనలో ఇంటర్మీడియట్ విద్యార్థులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇంటర్మీడియట్ విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచింది. కాని ఇప్పటికీ ప్రభుత్వ, సంక్షేమ తదితర జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందలేదు. ఇంటర్ విద్యామండలి నిధులతో పాఠ్యపుస్తకాలను ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఈ సంవత్సరంలో పుస్తకాల ముద్రణపై స్పష్టత కొరవడడంతో అందే పరిస్థితి కన్పించడం లేదు. జిల్లాల విభజన తర్వాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో స్టాక్ ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేశారు. తాము బోధించిన పాఠ్యాంశాల్లో విద్యార్థులకు తలెత్తే సందేహాలను ఏమేరకు నివత్తి చేసుకోగలరన్న ఆందోళన లెక్చరర్లను వెంటాడుతోంది. గతేడాది జూనియర్ ఇంటర్‌లో ఉత్తీర్ణతతో వెనుకబడిన వారికి ఈ ఏడాదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ప్రశ్నార్థకంగా మారింది. మరోపక్క పుస్తకాలు లేకుండా తమ పిల్లలు ఎలా చదువుకోవాలన్న ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమ వుతున్నాయి. పిల్లల భవిష్యత్‌ను దష్టిలో పెట్టుకుని కొంతమంది తల్లిదండ్రులు వేల రూపాయలు వెచ్చించి మార్కెట్‌లో కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు.

లెక్చరర్ల చొరవతో పాత పుస్తకాలు పంపిణీ

ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో లెక్చరర్లు చొరవ చూపి సీనియర్ల వద్ద సేకరించిన పుస్తకాలను జూనియర్లకు అందజేశారు. ప్రస్తుతం ఆ పాత పుస్తకాల ద్వారానే విద్యార్థులు పాఠ్యాంశాలను అభ్యసిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎపిఆర్‌జెసి, కెజిబివి, ఎపి మోడల్, సాంఘిక సంక్షేమ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలలో అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత ప్రతిమండలంలో ఓ బాలికల జూనియర్ కళాశాలను(హైస్కూల్ ప్లస్)ఏర్పాటు చేశారు. వీటిలో చేరిన విద్యార్థులకూ ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు అందించాలి. దీనికితోడు జిల్లాలో ఇంటర్‌బోర్డు గుర్తింపు ద్వారా నడుస్తున్న ప్రయివేటు, అన్‌ఎయిడెడ్, ప్రయివేటు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ముద్రించి విక్రయించాల్సి ఉంది. ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల పరిధిలోని 356 కాలేజీలు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి అన్ని టైటిల్స్‌కు సంబంధించిన ఇండెంట్ తీసుకున్నారు గానీ పాఠ్యపుస్తకాలు మాత్రం సరఫరా చేయలేదు.

ఆందోళనలో విద్యార్థులు

జిల్లాలో సకాలంలో పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. గత సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా మెరుగుపడిన విషయం విధితమే. గత అనుభవాల నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందించేందుకు అధికార యంత్రాంగం కొంత మేరకు కసరత్తు చేసింది. పాతస్టాక్ ఉన్న వివిధ టైటిళ్లకు సంబంధించిన పుస్తకాలను కొంతమందికి పంపిణీ చేసింది. అయితే ఇప్పటికి వేల సంఖ్యలో మిగిలిన విద్యార్థులకు అందించాల్సి ఉందని గణాంకాలు చెబుతున్నాయి. కొత్తగా ప్రథమ ఇంటర్‌లో చేరిన విద్యార్థులకు పూర్తిగా పంపిణీ చేయలేదని సమాచారం. ఈ విద్యాసంవత్సరంలో మొదటి రెండో సంవత్సర విద్యార్థులకు జిల్లాలో అన్ని సబ్జెక్టులకు కలిపి సుమారు లక్ష పుస్తకాల కోసం ఇంటర్‌బోర్డుకు ఇండెంట్ పెట్టినట్లు అధికారులు తెలిపారు. పుస్తకాల కోసం ఇంటర్మీడియట్ బోర్డుకు ఇండెంట్ పంపించామని, సరఫరా చేసిన వెంటనే విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. ఈలోపు సీనియర్ విద్యార్థుల వద్ద ఉన్న పుస్తకాలను జూనియర్లకు అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

కొవ్వూరు రూరల్ : పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.సుందర్‌బాబు డిమాండ్ చేశారు. దేవరపల్లి మండలంలో పరమేష్ బయోటెక్ పరిశ్రమలో ఇద్దరు కార్మికులు త్రివేణి గ్లాస్ ఫ్యాక్టరీ పరిశ్రమలో ఒకరు, నేడు కొండగూడెం విజన్ డ్రగ్స్‌లో ముగ్గురు కార్మికులు ఫ్యాక్టరీలో పని చేస్తుండగా ప్రమాదాలు జరిగి చనిపోయారన్నారు. వరుసగా ఒక మండలంలో తరచూ ప్రమాదాల జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మతుల బంధువులు, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తే నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప శాశ్వత చర్యలు తీసుకోవట్లేదన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సినీనటుడు కృష్ణకు పలువురి నివాళి

ధవళేశ్వరం, నల్లజర్ల : సినీనటుడు కృష్ణ మృతికి పలువురు సంతాపం తెలిపారు. ధవళేశ్వరంలో సూపర్ స్టార్ కృష్ణ అభిమానుల ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.రమేష్, పి.జయ, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, మిరప మహేష్, దేవదాస్ గోపాల్, పిల్లి రాజు ఉన్నారు. నల్లజర్లలో స్థానిక బస్టాండ్ వద్ద కృష్ణ వైసిపి నాయకులు మద్దిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథపురం సర్పంచ్ చల్లారి శ్రీనివాస్‌రావు, అయ్యవరం సర్పంచ్ గుడిసె వీరస్వామి నీరుకొండ జయకష్ణ, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల పనితీరుపై పర్యవేక్షణ

తాళ్లపూడి : బిఎల్‌ఒల పనితీరును పర్యవేక్షించేందుకు ఆర్‌డిఒ ఆదేశాల మేరకు నలుగురు సూపర్‌వైజర్లను నియమించామని తహశీల్దార్ టి.రాధిక తెలిపారు. మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు సూపర్‌వైజర్‌తో కలిసి తాడిపూడి, పోచవరం, గజ్జరం, పైడిమెట్ట, ప్రక్కిలంక గ్రామాల్లో బిఎల్‌ఒల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జోడాల మాట్లాడుతూ ఓటు ఉందో లేదో తెలుసుకోవడంతో పాటు ఓటర్ కార్డులో మార్పులు ఉంటే సరి చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఒలు సత్యనారాయణ పాపమ్మ తదితరులు ఉన్నారు.

కరాటేలో తపస్విరెడ్డి ప్రతిభ

నిడదవోలు : నిడదవోలు నారాయణ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటారని హెచ్‌ఎం ఎన్.వేణుగోపాలరావు తెలిపారు. హైదరాబాద్‌లోని శ్రీకోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో కటా విభాగంలో బంగారు పతకం, కుమిటి విభాగంలో కాంస్య పతకాలను తపస్వి రెడ్డి గెలుచుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆంధ్రప్రదేశ్ గుజోరియో ఫెడరేషన్ స్టేట్ ట్రెజరర్ ఎం.ప్రసన్నకుమారి, ఎఒ సతీష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

కడియం ఎస్ఐగా వెంకటసురేష్

కడియం : కడియం ఎస్ఐగా టి.వెంకటసురేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో పనిచేశారు. సాధారణ బదిలీలో భాగంగా కడియం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. సంక్రాంతి సమీపిస్తుండడంతో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నేరాల అదుపుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. నూతన ఎస్ఐ వెంకటసురేష్‌ను స్థానిక విలేకరులు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

సుబ్బమ్మ త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - కడియం

స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరు సుబ్బమ్మ త్యాగాలు మరువలేనివని, నేటి సమాజానికి తెలియాల్సిన అవసరం ఉందనివైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు. దువ్వూరి 143వ జయంతిని కడియంలో మంగళవారం కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిక్కాల ఈశ్వరరావు, చిలుకూరి శ్రీనివాసరావు నేతత్వంలో జరిగాయి. ఈ సందర్భంగా సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడారు. తన యావదాస్తిని దేశ స్వాతంత్ర్య ఉద్యమం కోసం వెచ్చించిన గొప్ప మహిళ సుబ్బమ్మ అన్నారు. డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ సుబ్బమ్మ ఎన్నోసార్లు జైలు శిక్ష అనుభవించారన్నారు. ఎంపిపి వి.వెంకటసత్యప్రసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి కడియంలో దువ్వూరు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు మాట్లాడుతూ దువ్వూరు సేవలు నవతరానికి తెలియడం కోసం ఆమె పేర బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురాం, తోరాటి వసంతరావు, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం, ఎంఇఒ వి.లజపతిరాయ్, బ్రాహ్మణ సంఘం నాయకులు వేదాంతం నాని, రాంబాబు, అద్దంకి రాజాయోనా పాల్గొన్నారు



శోభశ్రీకి పురస్కారం అందిస్తున్న నాయకులు విజయలక్ష్మి తదితరులు

శోభశ్రీకి దువ్వూరి పురస్కారం

ఆంధ్ర విశ్వవిద్యాలయం సేనేట్ సిండికేట్ మెంబర్, ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ తాడి శోభశ్రీకి శ్రీమతి దువ్వూరు సుబ్బమ్మ స్మారక అవార్డు- 2022 కమిటీ ప్రదానం చేసింది. 35 ఏళ్లుగా దేశ విదేశాల్లో విద్యావేత్తగా, అధికారిగా ఎన్నో సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టిన శోభశ్రీ ఈ అవార్డు ఇవ్వడం ఎంతో సముచితం అని విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శోభశ్రీ మాట్లాడుతూ దువ్వూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కషి చేస్తానన్నారు.

పనిలేకే ప్రతిపక్షాల ఆరోపణలు : చందన

ప్రజాశక్తి - కడియం

పేదల ఇళ్ల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని సాక్షాత్తు దేశ ప్రధాని ముఖ్యమంత్రి జగన్‌పై ప్రశంసలు కురిపిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నాయని రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నేతలతో కలిసి జేగురుపాడు జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను చందన పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిపక్షం పనిలేకే ప్రభుత్వంపై విమర్శలకు దిగుతుందన్నారు. ఎక్కడైనా ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై పోరాడుతాయన్నారు. కాని రాష్ట్రంలో మాత్రం ఉనికి చాటు కోవడం కోసం పోరాటాలకు దిగటం కనిపిస్తుందన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించడం చేతకాక ఎంతసేపు పేదల పథకాలపై ఆరోపణలకు దిగటమే సరిపోతుందన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు అనవసర ఆరోపణలు మానుకోవాలన్నారు. అనంతరం వైసిపి మండల అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడారు. మూడేళ్లలోనే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ముఖ్యమంత్రి జగన్ ప్రజాభిమానాన్ని సొంతం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, రాష్ట్ర దేవాంగ కోపరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన్న వీరభద్రయ్య, మండల బూత్ కమిటీల అధ్యక్షులు తాడాల విష్ణు చక్రవర్తి, ఎంపిటిసి సభ్యులు ఆకుల సుధాకర్, కడియపులంక సొసైటీ త్రిమాన్ కమిటీ అధ్యక్షులు తిరుమల శెట్టి శ్రీనివాస్, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ గోపాలం, పొట్టిలంక ఇన్చార్జ్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్య సమర్పన్‌కు మదర్ థెరిసా అవార్డు

ప్రజాశక్తి - బిక్కవోలు

తొస్సిపూడి పరిసర ప్రాంతాల్లో కరోనా సమయంలో చేసిన సేవలను గుర్తించి బిషప్ సత్యసమర్పన్‌కు మదర్ థెరిసా అవార్డు దక్కింది. విశాఖకు చెందిన 'చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్' సంస్థ ఈ అవార్డును అందించింది. ఈ అవార్డు అందుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని సత్యసమర్పన్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.

చెత్త తొలగించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో రోడ్లపై ఉన్న చెత్తను తొలగించాలంటూ మహాసేన సభ్యులు మంగళవారం కలెక్టర్ కె.మాధవీలతకు విజ్ఞప్తి చేశారు. పది రోజుల క్రితం మున్సిపాలిటీ వారు రోడ్లకిరువైపులా ఉన్న చెట్లను తొలగించారు. చెట్లు దుంగలను మాత్రం వెంటనే తొలగించారు. కాని మిగిలిన చెత్త అంతా రోడ్లపైనే వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించారు. మంగళవారం సాయంత్రం లోపు సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసేన పశ్చిమగోదావరి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్, నాయకులు గుంటు ప్రకాష్ పాల్గొన్నారు

పవన్ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠాన్నధిరోహించాలని ఆకాంక్షిస్తూ పాదయాత్ర చేపట్టినట్లు కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు కాకర్ల కరుణాకర్ తెలిపారు. మంగళవారం గ్రామం నుంచి ద్వారా తిరుమల వరకూ వారు పాదయాత్ర చేపట్టారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వారితోపాటు నార్ని సత్యనారాయణ, పిట్టా ప్రసాదు, నీలం జోగేశ్వరరావు, ఉన్నమట్ల మనోజ్ కుమార్ పాదయాత్రలో పాల్గొన్నారు.

మిర్తిపాడులో అన్నదానం

ప్రజాశక్తి- సీతానగరం

కార్తీక మాసం సందర్భంగా మిర్తిపాడు రామాలయంలో టిడిపి రాజానగరం నియోజకవర్గ నాయకులు బర్ల బాబూరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సహకరించిన గ్రామ పెద్దలకు కతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని బర్ల తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - సీతానగరం

అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు నిరస తెలిపారు. లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం పెంచాలని, మెనూ ఛార్జీలు పెంచాలని ముగ్గళ్ల సచివాలయంలో కోరుకొండ ప్రాజెక్ట్ సెక్టార్ కార్యదర్శి పి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా అనేక సేవలు అందిస్తున్నామన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి సదుపాయం కూడా లేదన్నారు. ప్రహరీ, మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. బాలింతలు, గర్భిణులు కూర్చొనేందుకు కుర్చీలు కూడా లేకపోవడంతో అవస్థలుపడుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులను సైతం చెల్లించట్లేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అప్పులు చేసి కేంద్రాలను నడుపుతున్నారన్నారు. ఐదేళ్లుగా టిఎ, డిఎలను సైతం ప్రభుత్వం నిలిపేసిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలని, నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని కోరారు. రాయవరం ప్రాజెక్టులో తొలగించిన అంగన్‌వాడీ వర్కర్ గంగాభవాని, పెద్దాపురం ప్రాజెక్టు వర్కర్ ఎస్.బ్రహ్మణిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సచివాలయ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మహిళల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని తుపాకులగూడెంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణ పనులకు ఆమె మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం మహిళలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రలో విన్న ప్రజల కష్టాలను సిఎం జగన్ ఒక్కొక్కటిగా పరిష్కరించారన్నారు. మంత్రి వనితకు సర్పంచ్ కాకర్ల హేమలత, వైసిపి మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు దొరబాబు, వైస్ ఎంపిపి కె.రత్నకుమారి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి వెంట ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ ఉన్నారు.

100 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని పుల్లలపాడులో లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళశారం నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 100 మందికి నేత్ర వైద్యపరీక్షలు చేశారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకష్ణన్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు నాగరాజు వైద్యసేవలు అందించారు. ఆర్యవైశ్య జిల్లా ప్రముఖ నాయకులు కోన శ్రీనివాసరావు, ప్రారంభించారు. 22 మందికి నేత్ర శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, నల్లజర్ల శాఖ అధ్యక్షులు మహ్మద్ ఇలియా షరీఫ్, చీమకుర్తి కృష్ణపసాద్, డాక్టర్ బద్రి వీర శేఖర్‌రావు, యు.వెంకటేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, కల్లా మురళీరాజు, జామి రాంబాబు, సిహెచ్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గోకవరానికి రెండు సబ్‌స్టేషన్ల మంజూరు

గోకవరం : మండలానికి రూ.8 కోట్లతో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుమ్మల దొడ్డి, కొత్తపల్లి గ్రామాల్లో వీటిని నిర్మిస్తారన్నారు. వీటి వల్ల విద్యుత్ సమస్యలు తీరుతాయన్నారు. ఈ సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ చిట్టిరాజు, ఎఇ అశోక్, ఎంపిపి శ్రీవల్లి, నాయకులు వీరబాబు, పి.రాంబాబు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ లా నేస్తంతో న్యాయవాదులకు లబ్ధి

రాజమహేంద్రవరం : వైఎస్ఆర్ లా నేస్తంతో ఎంతో మంది జూనియర్ న్యాయవాదులు లబ్ధిపొందుతున్నారని వైసిపి లీగల్ సెల్ పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు సాధిక్ హుస్సేన్ అన్నారు. లీగల్ సెల్ సమావేశం మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. తొలుత వైఎస్ఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాధిక్ హుస్సేన్ మాట్లాడారు. నూతనంగా ఎన్‌రోల్ అయిన జూనియర్ న్యాయవాదులను గుర్తించి వారందరికీ వైఎస్ఆర్ లా నేస్తం పథకం వర్తించేలా లీగల్ సెల్ నాయకులు కృషి చేయాలన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేలా చేస్తున్న పరిణామాలపై లీగల్ సెల్ తరపున గట్టిగా ప్రతిఘటించేలా చర్యలు చేపట్టాలన్నారు. లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి నేతత్వంలో లీగల్ సెల్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



వీర్రాజును ఘనంగా సత్కరిస్తున్న సొసైటీ అధ్యక్షులు గాజింగం

ఘనంగా సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం సొసైటీలో సిఇఒ దాసరి సురేష్ ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు అధ్యక్షతన 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు పాల్గొన్నారు. సప్త వర్ణ సహకార పతాకాన్ని ఎగురవేశారు. సిబ్బందితో ఇన్‌ఛార్జి శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం దీర్ఘకాలిక రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ ఆకులు వీర్రాజును ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు **రైటప్:**

పేపర్‌మిల్లు కాలుష్యాన్ని అరికట్టాలి

రాజమహేంద్రవరం : ఎపి పేపర్ మిల్లు నుంచి విడుదల చేసే రసాయన వ్యర్థాలను గోదావరిలో కలవనీయకుండా ధవళేశ్వరం దాటిన తర్వాత గోదావరిలో కలిసే విధంగా ప్రత్యేక ఛానల్ పైప్ లైన్ ఏర్పాటు చేయాలని గోదావరి పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు టికె.విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. పేపర్‌మిల్లు నుండి విడుదలైన వ్యర్థ జలాలు గోదావరిలో కలవనీయకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో గల పోలీస్ గెస్ట్‌హౌస్ ప్రక్కన టికె.విశ్వేశ్వర రెడ్డి రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా టికె మాట్లాడారు. వ్యర్థజలాల వల్ల గోదావరి నీరు కలుషితమవుతుందన్నారు. ఈ నీటిని తాగుతున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షకు సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం సంఘీభావం తెలిపారు.

పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలి

చాగల్లు : ధాన్యన్ని పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని పలువురు రైతులు జెసి శ్రీధర్‌కు విన్నవించారు. యశ్వంత్‌పురంలో రైస్ మిల్ వద్ద జరుగుతున్న ఆన్‌లైన్ కొనుగోలు ప్రక్రియను జెసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు జెసిని కలిశారు. నూతన విధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకో విధానం పెడుతూ ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బుంటేనే వ్యవసాయం అనే తీరుగా ఉందని రైతులు వాపోయారు. ధాన్యం తరలించడానికి ప్రభుత్వం ఇచ్చే రుసు ముకు రెట్టింపు అవుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.


ఘనంగా సిస్టర్ జానెట్ పుట్టినరోజు

గోపాలపురం : సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ జానెట్ పుట్టినరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వేళ్లచింతలగూడెం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ఆధ్వర్యంలో భారీ పుట్టిన రోజుక కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అత్యధికంగా సాధించేందుకు ఆమె ఎంతగానో కషి చేస్తున్నారని పలువురు కొనియాడారు.



కేక్‌ను కట్ చేస్తున్న సిస్టర్ జానెట్

కార్టూ'నిజం'



ఉత్సాహంగా పుస్తక ప్రదర్శనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం పలు గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలను నిర్వహించారు. **కొవ్వూరు** ప్రథమ శ్రేణి శాఖాగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సిఐలెఎల్ఎస్.రవికుమార్ ప్రారంభించారని లైబ్రేరియన్ జివివిఎస్.త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వల్ల కలిగే అనార్థలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసై యువత భవిష్యత్తును పాడుచేసుకుంటుందన్నారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రులకు పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొనఆనరు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. **గోకవరం** శాఖ గ్రంథాలయంలో లబ్రేరియన్ కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సుమారు 16 వేల పుస్తకాలు ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** వైజ్ఞానిక పుస్తక ప్రదర్శనను ఎంఇఒ పివిఎస్.నాగరాజు ప్రారంభించారు. మంచి విద్యావంతులుగా మారాలంటే పుస్తక పఠనం అలవాటుగా మారాలన్నారు అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్, గోవర్ధన్, గ్రంథాలయ నిర్వాహకుడు జి.కృష్ణారావు పాల్గొన్నారు. **బిక్కవోలు** బిక్కవోలు ఉన్నత పాఠశాలలో గ్రంధాలయ వారోత్సవాలను హెచ్‌ఎం పైడిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన జాతీయ నాయకుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణవేణి, పి.సత్యనారాయణ, జివి.రంగనాథ్, పి.డి.నాగమణి పాల్గొన్నారు. **సీతానగరం** మండల గ్రంథాలయంలో టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆత్మ కమిటీ చైర్మన్ డాక్టర్ బాబు హాజరయ్యారు. నెహ్రూ, గాంధీల పటాలకు నివాళులర్పించారు. **దేవరపల్లి** శాఖ గ్రంథాలయంలో మంగళవారం పుస్తక ప్రదర్శనను ఎంఇఒ ఎం.తిరుమల దాసు ప్రారంభించారు. హెచ్‌ఎం బి.శ్రీలక్ష్మి, గ్రంథాలయ అభివద్ధి కమిటీ అధ్యక్షులు దాపర్తి సోమరాజు, గ్రంథ పాలకుడు కెవివి.ప్రసాద్ పాల్గొన్నారు. పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. **తాళ్లపూడి** శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.రామరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా చిన్నతనం నుంచి పుస్తకాలను చదవడం నేర్చుకోవాలన్నారు. చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎ.నరేష్, ఎంఇఒ తదితరులు పాల్గొన్నారు. **కడియం** శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, డ్రగ్స్ అనర్థాలపనై అవగాహన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిజిస్ట్రార్ రాయుడు వెంకటరామారావు, వైసిపి నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ తాడి శోభశ్రీ,. ఎంఇఒ లజపతిరాయ్, లైబ్రేరియన్ శ్రీదేవినిర్మల పాల్గొన్నారు. **చాగల్లు** శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఎంపిడిఒ బి.రాంప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ కోడి నాగేశ్వరరావు, రిటైర్డ్ గ్రంథాలయాధికారి కుందుల వీరభద్రరావు, తెలుగు టీచర్లు హరిదాసు నాగేశ్వరావు, నాగ దుర్గారావు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామారావు

26వ డివిజన్‌లో గడపగడపకూ..

ప్రజాశకి-కాకినాడ

కాకినాడ 26వ డివిజన్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు సంగాని నందం, కామాడి సీత, చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, బొర్రా రమణ, కొప్పనాతి బాబి పాల్గొన్నారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మంగళవారం 34 బి సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల హాజరును పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న వినతులు, వాటి పరిష్కారాన్ని ఆరా తీశారు. రెవెన్యూ వసూళ్లు, గృహ నిర్మాణం, ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై సచివాలయ ఉద్యోగులకు సూచనలిచ్చారు. అనంతరం కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు.

అధికారులను నియమించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి జిల్లా చింతూరు మండలంలో అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చింతూరు మండల ప్రజాప్రతినిధులు మంగళవారం జెడ్‌పి సిఇఒ ఎన్‌వివి.సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతూరు మండలంలో ఎంపిడిఒ, ఒక అటెండర్ తప్ప ఏ అధికారులూ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు సుధా కాలనీలో రూ.27 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు, ఎఇ కృష్ణ జీవప్రసాద్, అవార్డు కౌన్సిలర్ కొట్టి పవన్ కిషోర్, సుధా అగ్రో ఎండి రామకృష్ణ, కొట్టి సుధాకర్, మద్దాల చలం, సిద్ది బాబ్జి, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్, సిద్ధి బాబ్జి, చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపిపిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఏలేశ్వరం ఎంపిపిపై చర్యలు తీసుకోవాలని ఆ మండల జెడ్‌పిటిసి, 12 మంది ఎంపిటిసిలు, 9 మంది సర్పంచులు మంత్రులు, కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. జెడ్‌పి కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రులు వేణు, రాజా, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాకు ఎంపిపిపై చర్యలు తీసుకోవాలంటూ వినతులు సమర్పించారు.

ధాన్యం కొనుగోలులో సమన్వయం అవసరం

ప్రజాశక్తి-కరప

రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వాలంటీర్లు అధికారులతో సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని జెసి ఇలాక్కియా ఆదేశించారు. మంగళవారం ఆమె కరప మండలంలో పర్యటించారు. మండలంలోని వేళంగి, సిరిపురం రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. తహశీల్దారు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కలెక్టర్ దంపతుల పూజలు

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక కుమార రామ భీమేశ్వర స్వామి వారిని కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, దంపతులు కృతిక శుక్లా, హిమన్షు శుక్లా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వీరికి ఆలయ కార్య నిర్వహణాధికారి డి.నాగమల్లేశ్వరరావు, ధర్మకర్తల మండల చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

గ్రంథాలయాల్లో పుస్తకావిష్కరణ కార్యక్రమం

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో 55వ జాతీయ గ్రంథాలయోత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం కార్యక్రమాలుజరిగాయి. **మండపేట** స్థానిక ఏడిద రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎం. సత్యవతి తదితరులు మాట్లాడారు. గ్రంథాలయాధికారి ఎన్. బాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవర్చుకుని విజ్ఞానవంతులు కావాలని గ్రామ సర్పంచ్ శాఖ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం వెంకట్ రాజు అన్నారు. కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పాలకురాలు డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు, పుస్తకప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొక్క రాంబాబు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

ప్రజాశక్తి -అమలాపురం

స్థానిక అంబేద్కర్ భవన్ నందు యువజన సర్వీ సుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు -2022 మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పి.గన్నవరం ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ 15-29 ఏళ్ల మధ్య వయస్సుగల యువత వివిధ సాంస్కృతిక అంశాలలో జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌కు జిల్లాస్థాయిలో 18 ఈవెంట్లకు గాను 399 మం ది, రాష్ట్రస్థాయిలో 16 ఈవెంట్లకు గాను 251 మంది నమోదు చేసు కున్నా రని తెలిపారు. విజేతలను జాతీయస్థాయి పోటీల కు పంపించడం జరుగుతుందన్నా రు. సెట్రాజ్ సిఇఒ డిఎస్‌ఎస్.సునీత తదితరులు ప్రసంగించారు.

పలు చోట్ల వైద్య శిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో మంగళవారం పలుచోట్ల ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. వివరాలు ఇవి..

ఆలమూరు పేదల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరు తప్పక వినియోగించుకోవాలని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. చింతలూరులో నూకంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఎజిపి, వైసిపి నేత నామాల శ్రీనివాస్ సహకారంతో జిఎస్‌ఎల్ డెంటల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్, ఎడ్యుకేషన్ సొసైటీ సిఇఒ ఎన్.గోవిందరాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాధారణ ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎంఎల్‌ఎ విచ్చేసి ప్రారంభించారు. **మండపేట** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియం చేసుకోవాలని వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఏడిదలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రమళ్ళ బులివీర్రాజు, వైద్యులు ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** గ్రామాల్లో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. కపిలేశ్వరపురం దేవి సెంటర్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో అంగర పిహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలి ఫిజీషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. **కొత్తపేట** మిషన్ ఆసియా మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ కాలనీ లో మెరియల్ చిల్డ్రన్స్ హోమ్ వద్ద సిడబ్ల్యూఎ మండల ప్రెసిడెంట్ పిఎస్.జయరాజు అధ్యక్షతన మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అంబాజీపేట కు చెందిన వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది 200 మంది పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

పిఎంసి చైర్మన్‌గా జ్యోతి ఎన్నిక

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల పిఎంసి చైర్మన్‌గా మంగళవారం సబ్బతి జ్యోతి ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు పిఎంసి చైర్మన్‌గా ఇళ్ల వెంకటలక్ష్మి ఉన్నారు. చైర్మన్ గా ఎన్నికైన జ్యోతిని పలువురు అభినందించారు.

స్థానిక దినపత్రికలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక దినపత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మార్చిన 142 జిఒను సవరించి పబ్లిషర్లు, ఎడిటర్లకు న్యాయం చేయాలని ఎడిటర్స్ అసోషియేషన్ మంగళవారం బిసి సంక్షేమ, సమాచార శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ముందుగా ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. అసోసియేషన్ లెటర్‌పాడ్‌ను మంత్రి , కాకినాడ ఎంపీ వంగా గీత, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భ ముగా ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పితాని వెంకట రాము రాష్ట్రంలో స్థానిక దినపత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి వేణు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోనేటి శ్రీనివాస్, పితాని వెంకట రాము, పుర్రె త్రినాథ్, ఎ.జయశ్రీను, పి.వేణుబాబు, ఖండవల్లి సునీల్ కుమార్, మోర్త బాలకుమార్, ఎ.వెంకట రమణ కుమార్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం అభివృద్ధి

ప్రజాశక్తి-సామర్లకోట, పెద్దాపురం, యు.కొత్తపల్లి

ప్రపంచ జ్ఞానమంతా పుస్తకాల్లోనే దాగి ఉన్నందున పుస్తక పఠనంతో జ్ఞానం అభివృద్ధి చెందుతుంది అని గ్రందాలయాధికారి బందిల రత్నామణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల రెండో రోజు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని పోటీ పరీక్షలలో పాటు జికె, కరెంట్ అఫైర్స్, ఇతర సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలన్నీ గ్రంథాలయాల్లో అందుబాటులో అన్నందున వాటిని ఉపయోగించు కావాలన్నారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర మాట్లాడారు. ఎంఇఒ సిహెచ్‌వివి. సత్యనారాయణ, పాలంకి నాగరాజు, బల్లమూడి సూర్యనారాయణ మూర్తి, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు. యు.కొత్తపల్లి ఉప్పాడలో మంగళవారం రెండో రోజు ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి టి.నళిని ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తకాలు చదివితే విజ్ఞానం పెంపొందించేందుకు దోహద పడుతుందని చెప్పారు.

పట్టాభి ఆగ్రో ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం


నిరసన తెలుపుతున్న కార్మికులు

స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ పరిశ్రమలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తున్న తమను పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయమన్నందుకు విధుల నుండి తొలగించారన్నారు. ఆరు నెలలుగా కార్మికుల కుటుంబాలు ఎన్నో అవస్థలు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దేవాబత్తుల రమేష్, గోళ్ల బాలరాజు, కందా శివ, కొండేటి జాన్, యోహాన్ రాజు, పెంకే శ్రీను, ఎం.విష్ణు, సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్, కె.అప్పన్న, ఆర్.వీర్రాజు, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుకు జ్యోతుల నెహ్రూ పరామర్శ

గండేపల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎన్‌టి.రాజాపురానికి చెందిన టిడిపి నాయకుడు కానుకోనుల శ్రీనును జ్యోతుల నెహ్రూ రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కంటిపూడి సత్తిబాబు, కానుకొనల వాసు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం సేకరణకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు రైస్ మిల్లర్లు కృషి చేయాలని జెసి ఇలాక్కియా రైస్ మిల్లర్లను కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం జెసి ఎస్.ఇలాక్కియా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైసు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపడుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సమర్పించాల్సిన బ్యాంకు గ్యారంటీలను సకాలంలో చెల్లించాలని కోరారు. ధాన్యం సేకరణలో అవసరమైన గోనె సంచులను రైతు భరోసా కేంద్రాలకు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను జెసి రైస్ మిల్లుల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.


సూర్యారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది తదితరులు

తహశీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల తహశీల్దార్‌గా కొమరం సూర్యారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన తహశీల్దార్ పి.చిన్నారావు రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. తహశీల్దార్ కె.సూర్యారావును డిటి బాలాజీ, ఆర్ఐ సంధ్య, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడల దోహదం

ప్రజాశక్తి -రావులపాలెం

శరీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అమలాపురంలో జరగబోయే జగనన్న క్రీడా సంబరాల ఆటల పోటీలకు కొత్తపేట నియోజకవర్గం నుంచి సీనియర్ విభాగంలో పురుషుల, మహిళల కబడ్డీ, వాలీబాల్ టీం, పురుషుల క్రికెట్ టీం ఎంపికను మంగళవారం రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయ కుష్టు నిర్మూలన కోసం అవగాహన ర్యాలీ మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పిహెచ్‌సిల పరిధిలో మంగళవారం వైద్యులు ఎమ్.సుమలత, ఆర్.సుదర్శన్ బాబు, పి.భవాని శంకర్, డి.సువచ్చల నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుష్టు వ్యాధి లక్షణాలపై వివరించారు. హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎవివి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన బస్సు

17 గొర్రెలు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గొర్రెల మందపైకి ఒక పరిశ్రమకు చెందిన బస్సు మంగళవారం దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 17 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాలివి.. సామర్లకోట మండలం అచ్చంపేట ఎడిబి రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపాన కొప్పవరం సమీపంలో రోడ్డు పక్కన వెళ్తున్న గొర్రెల మంద పైకి పనసపాడులోని అపెక్స్‌రొయ్యల పరిశ్రమకు చెందిన బస్సు దూసుకు వెళ్లింది. బస్సు రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటన లో 17 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 12 గొర్రెలు గాయపడ్డాయి. బస్సు బోల్తా పడడంతో బస్సులో విధుల నిర్వహణకు వెళుతున్న ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల మేర నష్ట పోయినట్లు గొర్రెల యజమాని అప్పన్న వాపోయారు. ప్రమాద స్థలానికి తిమ్మాపురం పోలీసులు చేరుకుని నమోదు చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం గొర్రెల యజమానికి రూ.2లక్షలు నష్టపరిహారం చెల్లించేలా ఒప్పందం కుదుర్చు కున్నట్లు తెలిసింది.

'వైసిపి ప్రభుత్వంలో ఎంబిసిలకు గుర్తింపు లేదు'

ప్రజాశక్తి-అయినవిల్లి

వైసిపి ప్రభుత్వంలో ఎంబిసిలకు గుర్తింపు లేదని, బతుకుదెరువు లేక ఆర్థిక ఇబ్బందులలో వున్నారని రాష్ట్ర బిసి సాధికార సమితి ఎంబీసీ కన్వీనర్ పెంద్రరమేష్ అన్నారు. మచిలీపట్నంలో టిడిపి కార్యాలయంలో రాష్ట్ర బిసి ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర మంగళవారం ఆ పార్టీ ఎంబీసీ సాధికారత సమితి భేటీ జరిగింది. రవీంద్ర మాట్లాడుతూ జిల్లా కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇచ్చిన బాధ్యతలను క్రమశిక్షణతో పూర్తి చేయాలన్నారు. పెంద్రరమేష్ మాట్లాడుతూ జిల్లా కమిటీలను త్వరితగతిన పూర్తి చేస్తామని,అందుకు అందరి సహకారం కావాలని ఆకాంక్షించారు. ఎంబీసీ లకు చంద్రబాబు హయాంలోనే న్యాయం జరిగిందన్నారు.

150 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకుర్రు శివారు గొల్లగరువులో 150 నాన్ డ్యూటి పెయిడ్ మద్యం సీసాలను కాట్రేనికోన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గొల్లగరువులో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో నేరేడుమిల్లి సత్యనారాయణ ను అదుపులో తీసుకుని 150 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మద్యం సరఫరా చేసిన బలుసుతిప్పకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాట్రేనికోన టి.శ్రీనివాస్ తెలిపారు

అన్నదానంలో పాల్గొన్న నవీన్

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం నిత్యాన్నదానంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ అన్నదానానికి సరిపడా గ్యాస్‌ను పార్టీ ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అడబాల భాస్కరరావు, అన్నదానం ట్రస్ట్ చైర్మన్ జె.రాంబాబు, అడబాల సత్యనారాయణ, కంటిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

18న పెదపూడి మండల సమావేశం

ప్రజాశక్తి-పెదపూడి

ఈ నెల 18న పెదపూడి మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించిస్తున్నట్లు ఎంపిడిఒ పోకల విజయభాస్కర్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా, ఎంపిపిగా కేతా తులసి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.


ఎన్నికైన సభ్యులు

భవన కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రత్తిపాడు కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సీరం సత్తిబాబు, బొజ్జా సురేష్, ఉపాధ్యక్షులుగా కొప్పుశెట్టి లోవరాజు, మర్రి గోవింద్ కోశాధికారిగా గడ్డం సతీష్, సహాయ కార్యదర్శులుగా పిల్లా శ్రీను, రాంబాబులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డుకి జమ చేయాలని, పెండింగ్ క్లెయిములను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

10 కాసుల బంగారం చోరీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తుపాకుల గూడెంలో ఒక ఇంట్లో ఎవరూ లేని సమయంలో 10 కాసుల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ కెవి.రమణ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శీలబోయిన మురళీకృష్ణ ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నారు. అతని సోదరుడు కూడా హైదరాబాదులోనే ఉంటున్నాడు. తల్లి గ్రామంలోని ఇంట్లోనే ఉంటోంది. ఇటీవల ఆమె వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని తెలుసుకున్న దుండగులు ఇంట్లో చొరబడి పది కాసుల బంగారు నగలను దోచుకుపోయారు. బాధితుడు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఇంటిని కొవ్వూరు డిఎస్‌పి సత్యనారాయణవర్మ, సిఐ వైవి.రమణ మంగళవారం పరిశీలించారు.